క్లుప్తంగా

సాగు హక్కులు కల్పించాలి



చిలకపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం భూములను సాగు చేస్తున్న రైతులకు సాగు హక్కులు కల్పించాలని, వారిపై వేధింపులు ఆపాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చిలకపాలెంలో ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. భూముల్లో వేసిన పశువుల పాకలు తొలగించడాన్ని ఖండించారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. ర్యాలీలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పరిణయ వేదికకు స్పందన



మాట్లాడుతున్న జిల్లా బ్రాహ్మణ సంఘం కార్యదర్శి శ్రీరామశర్మ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఓ ఫంక్షన్ హాల్‌లో విశాఖకు చెందిన లక్ష్మీనారాయణ పరిణయ వేదిక, జిల్లా బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికకు మంచి స్పందన లభించింది.సుమారుగా 200 మంది యువతీ యువకుల ఫొటోలను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం కార్యదర్శి భాస్కరభట్ల శ్రీరామశర్మ, వేదిక నిర్వాహకులు మధిర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాల విత్తన కిట్లతో మహిళా రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: భూసారం పెంపునకు నవధాన్యాలు సాగు దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మన్నాయుడు అన్నారు. జరజాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న మహిళా సంఘాలకు నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులు వర్షాలు పడ్డ వెంటనే నవధాన్యాలు సాగు చేయాలని సూచించారు. దీని వల్ల రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుందని, భూసారం పెరుగుతుందని చెప్పారు. రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జి జగన్ మాట్లాడుతూ వ్యవసాయ యాజమాన్య ఖర్చులు తగ్గాలంటే ప్రకృతి వ్యవసాయ సాగు కీలకమని తెలిపారు.

యువత రక్తదానం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 80 మంది యువకులు రక్తదానం చేశారు. టీడీపీ నేత గొండ శంకర్ జన్మదినం సందర్భంగా ఈ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.


ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడి

రణస్థలం: కొండములగాం ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షకు సంబంధించి ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ పాట్నూరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కుల వివరాలను నోటీస్ బోర్డులో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

20 నుంచి మొండేటివీధిలో రథయాత్ర

శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో షిరిడీసాయి బాబా ఆలయం, లలితా సహిత శివ కామేశ్వర స్వామి ప్రాంగణంలో ఈ నెల 20 నుంచి 28 వరకు పూరీ జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 20న రథంపై ఊరేగింపు, తొమ్మిది రోజుల పాటు వివిధ అవతారాలలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

ఆనందపురంలో పారిశుద్ధ్య పనులు



పనులు చేపడుతున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం ప్రధాన వీధిలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. సర్పంచ్ చిత్తిరి మంజు, నాయకులు చిత్తిరి మోహన్, పంచాయతీ కార్యదర్శి పైల జయరామ పర్యవేక్షించారు.

పద్మవ్యూహంలా పెద్దమార్కెట్

- లోపలికి వెళ్తే తిరిగి రావడం కష్టమే..
- అన్‌లోడింగ్ పేరిట భారీ వాహనాల తిష్ఠ
- పరిసర ప్రాంతాల వాసులకు తప్పని ఇబ్బందులు



ట్రాఫిక్ పోలీసులతో ప్రజల వాగ్వాదం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. మార్కెట్‌ను ఆనుకుని మేదరవీధి, కాకివీధి, చినబరాటం వీధి, గండేటివీధి, రైతుబజారు సందు, నీలం ఆటో మొబైల్స్ ఇలా.. ప్రతిచోటా రహదారి ఇరుకుగా ఉంటుంది. ఇలాంటి సందుల్లో భారీ లారీలు హోల్‌సేల్ షాపులకు అన్‌లోడింగ్ పేరిట అనుమతులు లేని సమయంలో (ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు) ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో తిష్టవేస్తున్నాయి. దీంతో గురువారం రోగితో ఉన్న అంబులెన్సు అరగంట సేపు వేచి ఉండాల్సి వచ్చింది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఓ లారీ, పక్కనే ఉన్న ఆటోలు అడ్డుగా ఉండటంతో సుమారు రెండు గంటల సేపు అటుగా వచ్చే ద్విచక్రవాహనదారుల, ఓ కారు ఉండిపోయాయి. దీంతో ఆగ్రహానికి గురైన ప్రజలు లారీవాళ్లను తప్పుకోమంటే.. మీద ఎక్కి పంపిచేస్తామని బెదిరింపులకు దిగారు. అప్పటికే అక్కడికి చేరిన ట్రాఫిక్ పోలీసులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు అక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించినా.. మళ్లీ శనివారం షరా మామూలే. 24 గంటలూ తమకు అనుమతులున్నట్లు పలుచోట్ల అన్‌లోడింగ్ చేస్తూ లారీలు తిష్ఠవేశాయి. సమీపంలోనే పాతబస్టాండు, ఫైర్ స్టేషన్‌లే కాక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్, సబ్‌డివిజనల్ పోలీస్ కేంద్రం ఉన్నాయి. దీనిపై డయల్ 100కు పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇక పీఎస్ఆర్ కూడలి నుంచి చినబరాటం వీధికి వెళ్లే దారిలో అనధికార ఆటోస్టాండ్ వెలిసింది. కూడలి నుంచి వీధికి వెళ్లే మలుపు డౌన్ వద్ద సీరియల్ కోసం వెయిటింగ్ అంటూ వాహనాలు ఆపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది.



శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పెద్ద మార్కెట్టు వద్ద ట్రాఫిక్ ఇలా..



శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు మేదరవీధి నుంచి మార్కెట్ దారిలో అన్‌లోడింగ్ ఇలా..

రూ.195 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పనులు



పనులు పరిశీలిస్తున్న డీఈఈ పైడి సూర్యనారాయణ

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో నాలుగు మండలాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వం రూ.195 కోట్లు వెచ్చిస్తోందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పైడి సూర్యనారాయణ అన్నారు. ఆదివారం జి.సిగడాం మండలంలోని గంగన్నదొరపాలెం, జి.సిగడాం, ఆనందపురం, నడమివలస గ్రామాల్లో జరుగుతున్న కుళాయి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పైపులైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జి.సిగడాం మండలంలో 91 పనులకు గాను రూ.30కోట్లు 34 లక్షల 10 వేలు, లావేరు మండలంలో 144 పనులకు గాను రూ.44 కోట్ల 34 లక్షల 44 వేలు, ఎచ్చెర్ల మండలంలో 180 పనులకు గాను రూ.59 కోట్ల 67 లక్షల 38 వేలు, రణస్థలం మండలంలో 202 పనులకు గాను రూ.60 కోట్ల 86 లక్షల 29 వేలు చొప్పున ప్రభుత్వం నిధుల మంజూరు చేసిందని వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు స్థానికులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పాటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పాటలను చక్కగా ఆలపించారు. బాగా పాడిన ఎల్.నందిని, ఎల్.మాధురి, కె.సుధన్య, శిరీషలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, సాయి ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

రథయాత్రకు చురుగ్గా ఏర్పాట్లు



మురపాకలోని జగన్నాథుని ఆలయం

లావేరు: మండలంలోని మురపాకలో జగన్నాథ స్వామి ఆలయం వద్ద ఈ నెల 20 నుంచి 22 వరకూ రథయాత్ర మహోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంతో పాటు జగన్నాథుడు, సుభద్ర, బలభద్రుని విగ్రహాలకు మెరుగులు దిద్ది ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. మూడు రోజుల పాటు జగన్నాథుని ఊరేగింపు, దర్శనాలు, భజనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు, పురోహితులు తెలిపారు.

ఉక్కపోతతో విలవిల

లావేరు: మండలంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు భానుడు తన ప్రతాపం చూపాడు. ఎండతో పాటు వేడిగాలులు, ఉక్కపోత ప్రారంభం కావడంతో బయటకు రాలేక, ఇళ్లల్లో ఉండలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు విలవిల్లాడిపోయారు. ఉదయం 10 గంటలు తరువాత మండలంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ నిర్మానుష్యంగానే దర్శనమిచ్చాయి. వ్యవసాయదారులు, ఉపాధి కూలీలు వేడిగాలులు, ఉక్కపోతకు తట్టుకోలేక అవస్థలు పడ్డారు.

జేఈఈ విజేతలకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు శ్రీచైతన్య విద్యాసంస్థల్లో చదువుతూ జేఈఈ అడ్వాన్స్–2023 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారని డీన్ కె.మురళీధర్, ఏజీఎం పి.నర్సునాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముంజేటి సాయి ప్రశాంత్ ఆలిండియా ఓపెన్ కేటగిరి 3051(ఓబీసీ 540), వై.ఆదిత్యరామ్ 4487(ఓబీసీ 856), కిల్లాన జశ్వంత్ 4823(ఓబీసీ 927), పైడి సుమంత్ 5558(ఓబీసీ 1087), ఉరుటి సాయిప్రశాంత్ 6816(ఓబీసీ 869), వి.సంజయ్ 7048, బి.రూపేష్ 7388, కె.సుభాష్ 7708, పి.విశ్వనాథం 9791, బి.కుమార్ 111229,డి.సాయిరాం 11900, ఎన్.కిషోర్ యడ్ల 12202 తదితరులు మెరుగైన ర్యాంకులు సాధించి ఐఐటీ సీట్లు సాధించారని చెప్పారు. శ్రీకాకుళంలో చదువుకున్న విద్యార్థుల్లో సుంకర రోహిత్, బత్తుల వెంకట సాయి మౌళిక్, ఎన్.గాయత్రి, వి.సంప్రీత్, దేవాన్ష్ నాయక్, బీహెచ్ కార్తికేయ, కె.భవేష్ భార్గవ్, ఎస్.దీవన్‌కుమార్, టి.రుద్రనారాయణ ఐఐటీల్లో సీట్లు సాధించే మెరుగైన ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందన్నారు.

కాలువల నిర్మాణంపై హర్షం



ఎమ్మెల్యే కిరణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న జె.ఆర్.పురం గ్రామస్తులు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గడపగడపకు–మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు కాలువలు నిర్మించడంపై స్థానిక సర్పంచ్ బవిరి రమణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్ వెనుక వైపు, కాపు వీధి, సినిమా థియేటర్ వీధిలో అర కిలోమీటర్ మేర కాలువలు వేసినట్లు తెలిపారు. గడపగడప మంజూరైన 20లక్షల నిధుల్లో భాగంగా అత్యవసరంగా కాలువలు, నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఇచ్చిన హామీల్లో 80శాతం పూర్తి చేశామని, మిగతా పెండింగ్ పనులు అతి త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఇందుకు గాను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, గ్రామ నాయకులు పిన్నింటి సత్యం నాయుడు, పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం తదితరులకు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు.

సేవా తత్పరుడు మండవిల్లి రవి



మండవిల్లి రవికి కేక్ తినిపిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎదుటివారికి సాయం చేయడంలో అందరి కంటే ముందుండే వ్యక్తి మండవిల్లి రవి అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. అప్పగించిన పనిని బాధ్యతగా పూర్తి చేసి ఇటు పార్టీకి అటు ప్రజలకు సమన్యాయం చేయగలిగే శక్తి ఉన్న వ్యక్తి రవి అని ప్రశంసించారు. రవి పుట్టిన రోజు సందర్భంగా పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆర్యవైశ్య కులస్తులంతా కేక్ కట్‌చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అరసవల్లి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా, వైఎస్సార్‌సీపీ మీడియా సెల్ ఇన్‌చార్జిగా, ఆర్యవైశ్యకుల సభ్యునిగా చక్కగా పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రతిఒక్కరూ సేవాభావం అలవరుచుకున్నప్పుడే సమాజంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం మదర్‌థెరిస్సా, బెహరా మనోవికాస కేంద్రం, రిమ్స్‌లో సుమారు 500 మంది నిరుపేదలకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ్యులు పేర్ల నర్సింగరావు, తమ్మన భాస్కరరావు, పేర్ల సురేష్, మగటపల్లి నానాజీ, పేర్ల మహేష్, బలభద్రుని సత్యమూర్తి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ఆర్చరీ పోటీల్లో విజేతలతో ఏఎస్పీ విఠలేశ్వరరావు తదితరులు

అరసవల్లి: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఏఎస్పీ విఠలేశ్వరరావు అన్నారు. అరసవల్లిలో ఆదిత్య ఆర్చరీ అకాడమీలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువిద్య (ఆర్చరీ) చాలా గొప్ప క్రీడ అని...విద్యార్థి దశ నుంచే ఇలాంటి క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందవచ్చునన్నారు. కాగా, అండర్ –9 విభాగంలో జి.విజయ్, సీహెచ్. భవానీప్రసాద్ తేజ, సీహెచ్.నిహాల్ రామ్‌తేజ, అండర్–14 విభాగంలో ఎ.కళ్యాణ్, ఓ.మేఘన, జె.సాయి సాహిల్, అండర్ –16 విభాగంలో కె.నీల మనోహర్‌నాయుడు, పి.త్రివేణి, జి.తనీషా చౌదరిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. కార్యక్రమంలో ఆదిత్య ఆర్చరీ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ చెటికం రాజ్‌కుమార్, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ ఎల్.చిట్టిబాబు, శిక్షకులు మధుసూదనరావు, ఈశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్నదానం



రిమ్స్‌లో అన్నదానం చేస్తున్న మండవిల్లి రవి

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ వ్యాపారవేత్త, అరసవల్లి దేవస్థానం పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి పుట్టిన రోజు సందర్భంగా రిమ్స్ సత్యసాయి అన్నపూర్ణ అన్నదాన పథకంలో భాగంగా ఆదివారం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యాన్నదానంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. గర్భిణులకు, చిన్నారులకు వేడినీటితో పాటు శుద్ధి చేసిన చల్లని మినరల్ వాటర్‌ను అందజేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సత్యసాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు, అన్నపూర్ణ సేవా ట్రస్టు అధ్యక్షుడు జి.రమణబాబు, జిల్లా సమన్వయకర్త సూర రామచంద్రరావులు రవిని అభినందించారు. కార్యక్రమంలో పేర్ల శ్రీకాంత్, పి.సాయిరాం, బి.రంగనాథ్ కుమార్, పూసర్ల వెంకటరాజు పాల్గొన్నారు.

అన్నపూర్ణ పథకానికి రూ.10వేలు విరాళం

సత్యసాయి అన్నపూర్ణ సేవా పథకానికి కొంచాడ సోమేశ్వరరావు కుమారుడు, వైద్యుడు కొంచాడ రవి కుమార్ తన జన్మదినం సందర్భంగా రూ.10వేలు విరాళం ట్రస్టు జాయింట్ సెక్రటరీ కిల్లాన ఫల్గుణరావుకు అందజేశారు.

ఎమ్మెల్యే కిరణ్ పరామర్శ



రమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గడి రమణ తల్లి వరలక్ష్మి ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గురాన చిరంజీవి, మహంతి సత్యనారాయణ, గడి బలరాం, పిల్ల వెంకటరమణ, బొంతు నర్సింహమూర్తి, పిల్ల గణపతి, గడి బాబూరావు, కిర్తీ మంగ, పిల్ల వాసు, పాలూరి బుజ్జి, కెల్ల రామకృష్ణ, పిల్ల సూర్యారావు, మంత్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆనందం



మిక్కీ మౌస్



నాగావళి రివర్‌వ్యూ పార్కు



నెట్ క్రికెట్‌బాక్స్



వాటర్ బోటింగ్

మండుటెండలతో విలవిల్లాడుతున్న చిన్నారులకు శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీ వద్ద నాగావళి రివర్ వ్యూ పార్కు ఆహ్లాదాన్ని అందిస్తోంది. శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని ఈ పార్కులో రకరకాల ఆటపరికరాలతో పాటు బంజీరిక్టర్, మిక్కిమౌస్, బుల్‌రైడ్, 360 డిగ్రీ సైకిల్, గైరోస్కోప్, వాటర్‌బోటింగ్, వాటర్‌రోలర్, నెట్‌బాక్స్ క్రికెట్, ఆర్చరి, గన్‌షూటింగ్, ఓపెన్ ఎయిర్ థియేటర్, ఓపెన్ జిమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9గంటల వరకు పార్కు తెరిచి ఉంచుతున్నారు. –శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)



ఆర్చరీ



వాటర్ రోలర్